క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



శివాలయంలో పూజలు చేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: నాగుల పంచమిని పురస్కరించుకొని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని పలు దేవాలయాల్లో సోమవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలు ఉన్న దేవాలయాల్లో, భక్తులు పుట్టలో పాలు, గుడ్లు వేసి చల్లంగా చూడాలని నాగులతల్లిని వేడుకున్నారు. బాలాపూర్‌లోని శివాలయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం నిర్వహించి హారతులు ఇచ్చారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కందుకూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత రాంచందర్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇంటి స్థలాలు లేక ఒక్కో ఇంటిల్లో రెండు, మూడు కుటుంబాలు నివసిస్తున్నారని వాపోయారు. కందుకూరు సర్వే నంబర్ 788లో గుడిసెలు వేసుకున్న ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.కుమార్, బి.బాల్‌రాజు పాల్గొన్నారు.


గౌడ సంఘం కొత్త కమిటీ చెల్లదు



విలేకరులతో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

కందుకూరు: కందుకూరు మండల గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీ చెల్లదని, కేవలం కొందరి సమక్షంలోనే ఆదివారం కమిటీ వేసుకుని ప్రకటించుకోవడం బాధాకరమని ఆ సంఘం ప్రస్తుత అధ్యక్షుడు పిరాటి సిద్ధేశ్వర్‌గౌడ్, నాయకుడు సరికొండ వెంకటేష్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25న మండల కేంద్రంలోని చందుపట్ల నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 30 గ్రామాల గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులతో సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఆ రోజే అందరి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాకేశ్‌గౌడ్, దేవేందర్, దామోదర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడకు చెందిన నిరుపేద విద్యార్థిని హిమబిందుకు తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ అండగా నిలిచింది. విద్యార్థిని హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని సర్పంచ్ సాధ మల్లారెడ్డి ద్వారా తెలుసుకున్న తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ సభ్యులు సోమవారం విద్యార్థినికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు గుప్తా, జిల్లా కార్యదర్శి మల్లేష్, మండల అధ్యక్షుడు భరత్, నాయకుడు బాలేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సబితారెడ్డికి గెలుపునకు కృషి చేస్తాం

తుక్కుగూడ : మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి సబితారెడ్డి గెలుపు మరోసారి ఖాయమని తుక్కుగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల మొదటి జాబితాలో మంత్రి పేరు సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షనీయమన్నారు. పార్టీల శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సినిమా చూసి వెళ్తూ..

- తాగిన మైకంలో బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఆరేళ్ల బాలుడు, యువకుడు మృతి



జనుమజిత్ సాహూ(ఫైల్)



సత్యజిత్ మోహపత్ర(ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రితో కలిసి సినిమా చూసేందుకు వచ్చిన ఆరేళ్ల బాలుడు సినిమా చూస్తూ నిద్రపోవడమే చిన్నారి పాలిటశాపంగా మారింది. నిద్రపోయిన కుమారుడిని స్నేహితుల బైక్‌పై ఎక్కించడంతో రోడ్డు దాటుతున్న బైక్‌ను వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో బాలుడి, మరో యువకుడు మృతి చెందారు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బిస్వజిత్ సాహా కుటుంబంతో కలిసి ఏడాది క్రితం వలస వచ్చి తుక్కుగూడలోని హార్డ్‌వేర్ పార్కులో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు తన కుమారుడు జనుమజిత్ సాహా(06), ఒడిశాకు చెందిన స్నేహితులు మనోరంజన్ బారిక్(28), సత్యజిత్ మోహపత్ర(30)లతో కలిసి తుక్కుగూడలోని శ్రీ ప్రేమ థియేటర్‌లో జైలర్ సినిమా చూసేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. సినిమా చూస్తూ జనుమజిత్ నిద్ర పోవడంతో బైక్‌పై కూర్చొపెట్టుకోవడానికి ఇబ్బందవుతుందని భావించిన బిస్వజిత్... తన స్నేహితుల బైక్‌పై ఇద్దరి నడుమ కూర్చొబెట్టి వెనుకాల వారిని అనుసరిస్తూ వస్తున్నాడు. రాత్రి 11.50 గంటల సమయంలో తుక్కుగూడ మార్కెట్ వద్ద స్నేహితుల బైక్ ముందుగా యూటర్న్ తీసుకుంటుండగా ఆమనగల్లు వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు మనోరంజన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కింద పడిపోయారు. గమనించిన బిస్వజిత్ హుటాహుటినా తన కుమారుడిని స్థానికంగా ఉన్న విజయసాయి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరిని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా సత్యజిత్ మోహపత్ర మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మనోరంజన్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. కారు నడుపుకుంటూ వచ్చిన వ్యక్తి మీర్‌పేట్ రాఘవనగర్‌కు చెందిన బియ్యం వ్యాపారి అల్ల శ్రీధర్‌రెడ్డి పూటుగా మద్యం సేవించి డ్రైవ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చ్యూరీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సంబరాలు



గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే సంబురాలు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీర్, యూజీసీ సెంటర్ డైరెక్టర్ ప్రొ.డా.కె.విశ్వనాథ్ విచ్చేసి విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం 2020తో విద్యా, సాంకేతిక మార్పుల వల్ల విద్యార్థుల సృజనాత్మక శక్తికి ఎంతగానో తోడ్పాటు అందిస్తుందన్నారు. అధ్యాపకులు నూతన విద్యాబోధన పద్ధతులను అవలంబించాలని సూచించారు. కళాశాలలో దూరదృష్టి, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో స్ఫూర్తి విద్యాసంస్థల అధినేతలు చైర్మన్ చెలమారెడ్డి, సెక్రటరీ జగన్మోహన్‌రెడ్డి, సక్రో హోలీ ధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కందుకూరు: మండల కేంద్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రారంభించడానికి మంగళవారం మంత్రి సబితారెడ్డి రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉ.10 గంటలకు కందుకూరు చౌరస్తాలోని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించిన అనంతరం టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీసీబంధు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సబితారెడ్డికి టికెట్ ఇవ్వడంపై హర్షం

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా మంత్రి సబితారెడ్డికి సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం కల్పించడంపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంత్రి చేస్తున్న అభివృద్ధి పనులతో తటస్థులతో పాటు ఇతర పార్టీలకు చెందిన వారు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. మరోసారి ఆమె విజయానికి అందరం కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు.

13 మద్యం దుకాణాలకు లక్కీ డ్రా

- దుకాణాలను దక్కించుకున్న 13 మంది
- మొత్తం 1290 దరఖాస్తులు

మహేశ్వరం: మహేశ్వరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 13 మద్యం దుకాణాలకు దరఖాస్తులను శంషాబాద్‌లోని ఓ గార్డెన్‌లో జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో సోమవారం డ్రాలు తీశారు. గత రెండు వారాలుగా దరఖాస్తుల ప్రక్రియలో మొత్తం 1290 దరఖాస్తులు వచ్చాయి. లక్కీ డ్రాలో 13 దుకాణాలను 13 మంది దక్కించుకున్నారని మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి తెలిపారు. డ్రాలో మద్యం దుకాణం(వైన్స్) వచ్చిన వారు లైసెన్స్ ఫీజులో 1/6 వంతు ఫీజు సకాలంలో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు మహేశ్వరం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

మండలం ఏర్పాటు చేసే వరకు పోరాటం

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలముగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 50 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గట్టుఇప్పలపల్లి అభివృద్ధిలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నా కూడా మండలం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. గతంలో 41 రోజులు, ప్రస్తుతం 50 రోజులుగా దీక్షలు కొనసాగుతున్నాయని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి లోపించడం కారణంగానే మండలం ఏర్పాటు కావడం లేదని ఆయన ఆరోపించారు. సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, చెన్నయ్య, రాజు, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ దుర్గదీప్‌లాల్, మాధవి

- మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ దుర్గ దీప్‌లాల్

మీర్‌పేట్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్ కేశవరెడ్డి నగర్ కాలనీ, డైనమిక్ కాలనీల్లో నూతనంగా చేపట్టిన రూ.8 లక్షల వ్యయంతో మంచి నీటి పైపులైన్ పనులు, డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అక్కిమాధవి, కమిషనర్ అల్లూరివాణి, అధికారులు గోపినాథ్, ఏఈ శ్రీనివాసులు, జలమండలి ఏఈ వివేక్ పలువురు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు ట్రస్టు చేయూత



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

తలకొండపల్లి: నిరుపేద విద్యార్థుల చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన ఎగిలిశెట్టి లక్ష్మి, శేఖర్‌ల దంపతుల పిల్లలైన జ్యోష్ణ 9వ తరగతి, మనోజు కుమార్ 10వ తరగతి చదువుతున్నారు. శేఖర్ ఇటీవల కిడ్నీ వ్యాధితో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పిల్లలిద్దరూ చదువు కష్టంగా మారింది. ఫీజులు ఎలా కట్టాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికుల సహకారంతో వారు ఉప్పల వెంకటేశ్‌ను కలుసుకొని చదువుకోడానికి సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ట్రస్టు ద్వారా చదివిస్తానని, ఖర్చులు తానే భరించి ఉన్నత విద్యనందిస్తానని భరోసా ఇచ్చారు. రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, మనోహర్, శ్రీను, సాయిలు, వీరస్వామి గౌడ్, మురళి, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం మెరుగు

- జెడ్పీటీసీ దశరథ్‌నాయక్




విజేతలకు నగదు బహుమతి ఇస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతోందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండలంలోని గానుగుమార్లతండా గ్రామ పంచాయతీలో జర్పుల రాధాకృష్ణ 20వ జయంతి సందర్భంగా, ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన జీఎంటీ కింగ్స్‌కు రూ.10 వేలు, రన్నరప్‌గా నిలిచిన జీఎంటీ జూనియర్స్‌కు రూ.6 వేల నగదును జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక వికాసంతో పాటు, ఒత్తిడిని జయించవచ్చని, ఆరోగ్య జీవితానికి క్రీడలు దోహదపడుతాయని అన్నారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు, క్రీడలపై దృష్టిసారించాలన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులకు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం అందించి, వారిలో దాగి ఉన్నా ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, నాయకులు రమేశ్, సేవ్యా, పాండు, రూప్‌సింగ్, రాజు, గణేశ్, ఇర్షాద్, వెంకటయ్య, సక్రు ఉన్నారు.

ప్రజా సేవకుడిగా పని చేస్తా

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

యాచారం: ఇబ్రహీంపట్నం నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రజాసేవకుడిగా పని చేస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లవెల్లి, మాల్ గ్రామాల నుంచి వంద మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయడానికి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 15 ఏళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేసినని తెలిపారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింతా అభివృద్ధి చేసి నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ప్రశాంత్‌రెడ్డి, రమేష్, మహేష్, బ్రహ్మచారి, మోహిన్, దస్తగిరి, జీవిద్ ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, సీనియర్ నాయకులు యాదయ్యగౌడ్, యాదయ్య, మల్లేష్, రాములు, లక్ష్మీపతిగౌడ్, శివ, రవిగౌడ్ పాల్గొన్నారు.

బస్ సర్వీసును పునరుద్ధరించాలని ధర్నా



కందుకూరు చౌరస్తాలో ధర్నా చేస్తున్న దెబ్బడగూడ గ్రామస్తులు

కందుకూరు: ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దెబ్బడగూడ వాసులు సోమవారం ఆ గ్రామ సర్పంచ్ ఏనుగు శ్రావణి ఆధ్వర్యంలో కందుకూరు చౌరస్తాలో శ్రీశైలం రహదారిపై బైఠాయించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ నెల 16న గ్రామానికి వచ్చిన బస్సు డ్రైవర్‌పై కొందరు దాడి చేశారన్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను నిలిపివేసి గ్రామస్తులందరికీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు పెట్టి చర్య తీసుకోవాలె తప్పా గ్రామస్తులందరికీ శిక్ష వేయడం ఏంటని ప్రశ్నించారు. కాగా, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడగా, సాయంత్రం వరకు బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి టి.వినోద్‌చారి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయం హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న పాలక మండలి సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ ఈఓ మురళీ కృష్ణ, కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్‌వాల్మీకీల ఆధ్వర్యంలో నాలుగు మాసాలకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.89, 982 వచ్చింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. బాలాజీ ఆలయానికి రోజు రోజుకు భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారన్నారు. త్వరలోనే ఆలయ బ్రహ్మోత్సవాలను కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఈసంపల్లి పద్మశంకర్ గౌడ్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, పూజారి సుధీర్ కుమార్‌లతో పాటు ఈరంకి రాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

పలు అంశాలపై విద్యార్థినులకు శిక్షణ



శిక్షణకు హాజరైన విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం: వాయిస్ ఫర్‌గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ సోమవారం ఇబ్రహీంపట్నం వినోబానగర్ నల్లకంచె గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై శిక్షణ కార్య క్రమం ప్రారంభించింది. సరూర్‌నగర్, మహేంద్రహిల్స్, ఆర్‌కేపురం, నార్సింగి, శంకర్‌పల్లి, నల్లకంచె గురుకుల విద్యాలయాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థినిలకు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం, సమాజ సేవ, ఆపద సమయంలో సులువుగా బయటపడటం, ఎదుటి వారికి ఇబ్బంది కలుగకుండా మాట్లాడటం తదితర అంశాలపై పది రోజుల పాటు శిక్షణను ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీలావతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రశాంత పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- చైర్‌పర్సన్ స్వప్న



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న స్వప్న తదితరులు

హయత్‌నగర్: మున్సిపాలిటీలోని అన్ని కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధిలో మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని పస్మాముల్లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, రూ.23 లక్షలతో నిర్మించే అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. సందర్భంగా స్వప్న మాట్లాడుతూ... కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని సూచించారు. మున్సిపాలిటీలో గుర్తించిన మురికివాడల్లో ప్రజల సమస్యలను తీర్చేందుకు ప్రాధాన్యత ఇస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ అశోక్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు శంకరయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



హయత్‌నగర్: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం విద్యార్థులు నిత్యకృత్యంగా మార్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు నోయల్, ఫిట్‌నెస్ ట్రైనర్ మోనేలాల్ అన్నారు. సోమవారం కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో వారు మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలను పెంచడం ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య, డైరెక్టర్ నవీన్, ప్రిన్సిపాల్ బాలరాజ్, ఏఓ శ్రీధర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

- రోగులతో కిటకిటలాడిన సీహెచ్‌సీ
- 8 మంది వైద్యులకు గాను ఇద్దరే విధులకు
- వైద్యం అందక గంటల కొద్ది నిరీక్షించిన బాధితులు



రోగులతో కిటకిటలాడుతున్న యాచారం సీహెచ్‌సీ

యాచారం: ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వ వైద్యాధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేసే వైద్యులు ఆ తర్వాత రోజుల్లో ఆస్పత్రికి రావడం మానేస్తున్నారు. యాచారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి సోమవారం మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వచ్చారు. విషజ్వరాలు, కాళ్లు, కీళ్లు, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రికి 250 మందికి పైగా వచ్చారు. సకాలంలో వైద్యులు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాచారం సీహెచ్‌సీలో మొత్తం 8 మంది వైద్యులు ఉండగా సోమవారం కేవలం మృదుల, రాజ్యలక్ష్మిలు మాత్రమే వచ్చారు. పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు వచ్చారు. వచ్చిన ఇద్దరు వైద్యులు రోగులకు సేవలు అందించడం కష్టంగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ కావడంతో యాచారం సీహెచ్‌సీకి రోగుల సంఖ్య క్రమేపి పెరుగుతుంది. ప్రజలు ఆసక్తితో ప్రభుత్వాసుపత్రికి వస్తుంటే వైద్యులు సకాలంలో ఆస్పత్రికి రాకపోవడం, వచ్చిన మధ్యాహ్నం వరకే ఉండి వెళ్లిపోవడంతో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. రెండు రోజుల క్రితమే యాచారం సీహెచ్‌సీకి పక్కా భవనం కోసం రూ. రెండు కోట్ల నిధులతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ ఉన్నతాధికారులు నిత్యం 8 మంది వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ, వారం రోజుల గడవక ముందే వైద్యులు తమ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు.